విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 04, అక్టోబర్ 2023

కలెక్టర్‌తో భూమా జరిపిన చర్చలు సఫలీకృతం

విశాలాంధ్ర -నంద్యాల : నంద్యాల పట్టణం లోని బొగ్గులైన్ నివాస రోడ్డు విస్తరణ నిర్వాసితుల తరుపున నంద్యాల మాజీ ఎమ్మెల్యే,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భూమా బ్రహ్మా నందరెడ్డి పోరాటం చేస్తున్నారు. విస్తరణ పేరుతో ఆప్రాంత ప్రజల ఇళ్లుకూలగొట్టేందుకు అధికారులు సిద్ధం కాగా బాధితుల పక్షాన భూమా నిలబడ్డారు. అదికారులు తుతు మంత్రంగా పట్టాలిచ్చి స్థలాలు చూపకపోతే ఎలా అంటూ భూమా అధికారులను నిలదీశారు. బాధితులకు ఇళ్ల స్థలాలు చూపించే వరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామ్యూన్ ను కలిసి చర్చించారు. పట్టాలు ఇచ్చినా అక్కడ పోసేషన్ లో వేరే వారున్నారని, మరికొన్ని కోర్టులో వున్నాయని, నివాస ప్రాంతానికి వెళ్ళదానికి రోడ్ కూడా లేదని ఈ పరిస్తితిలో అక్కడికి భాదితులు వెళ్లి నివాసం ఎలా ఉండగలరని భూమా ప్రశ్నించారు. బాధితుల సమస్యను భూమా ద్వారా విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. బాధితులకు పట్టాలిచ్చి స్థలాలు చూపించి రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు భూమా తెలిపారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా విన్నరని అందరికీ పట్టాలిస్తామని, స్థలాలు చూపించిన తర్వాతే ఖాళీ చేయిస్తానని భూమా బాధితులకు భరోసా ఇచ్చారు. స్థలాలలో ఇళ్లు నిర్మించేందుకు కూడా బాధితుల తరుపున కృషి చేస్తానని భూమా హామీ ఇచ్చారు. తమకు అండగా నిలబడిన భూమాకు భాదితులు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర - నంద్యాల : మూడు వ్యవసాయ చట్టాలని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో రైతాంగం చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా లఖీంపూర్‌లో రైతులు నిరసన ర్యాలీలో పాల్గొంటే నిరసన ర్యాలీని చెడగొట్టేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు రైతులపైకి కారును దూసుకెళ్లి ఏడుగురు మృతికి కారణమైనప్పటికీ, నేటి వరకు కేంద్ర సహాయమంత్రిని భర్తరఫ్ చేయకపోవడం దుర్మార్గమని, రైతులకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు అక్టోబర్ 3న బ్లాక్ డేను జరపాలని పిలుపులో భాగంగా నంద్యాలలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామ మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాల కృష్ణ మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రను వెంటనే బర్తరఫ్ చేయాలని, అదేవిధంగా ఆయన కొడుకుపై చర్య తీసుకోవాలని లేని పక్షంలో ఏఐటీయూసి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బ రాయుడు, ఆటో కార్మికులు జిలాన్, మురళి, వెంకటేశ్వర్‌రెడ్డి, సిద్దయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన ఉపాధ్యాయుల పర్యవేక్షణ

కుక్కల పాలైన మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర - అవుకు : రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న గోరుముద్ద పథకం కాస్త ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా కుక్కల పాలైన సంఘటన మండలంలోని రామాపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే మండలంలోని రామాపురంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో 118 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులకు భోజనాలు వడ్డించే సమయంలో ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా ఏఒక్క ఉపాధ్యాయుడు కూడా విద్యార్థుల వద్ద ఉండకపోవడంతో తరగతి గదిలో కూర్చొని భోజనం చేస్తున్న ఓ విద్యార్థి ప్లేటు వద్దకు వచ్చిన వీధికుక్కను చూసిన ఆ విద్యార్థి భయభ్రాంతులకు గురయ్యాడు. నేరుగా వెళ్లిన ఆకుక్క విద్యార్థి ప్లేట్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంచక్కా ఆరగించి వెళ్ళింది. ఇవివివి మాకు పట్టనట్లుగా ఉపాధ్యాయుల వ్యవహరించారు. ఆ సమయంలో అక్కడ ఉండాల్సిన ఉపాధ్యాయులు ఉండకుండా ఏమి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కుక్కలు విద్యార్థులపై దాడి చేస్తే పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తింది. 4 ఉపాధ్యాయులున్న పాఠశాలలోఈసంఘటన జరగడం గమనార్హం. అధికారులు తనిఖీలు చేపట్టి, ఇలాంటి సంఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

స్మశాన వాటికకు రహదారి ఏర్పాటు

విశాలాంధ్ర- నందికొట్కూరు : మండల పరిధిలోని శాతన కోట మజార జంగంపాడు గ్రామంలో గత కొన్నేళ్లుగా స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాజు గ్రామస్తులతో కలసి స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం లేదు. అదే రహదారిలో ముళ్ళ పొదల మధ్య శవాన్ని తీసుకుపోయే పరిస్థితి ఏర్పడింని ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన సిద్ధార్థ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి స్మశానానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు వెంటనే స్మశానానికి నూతన రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. దీంతో గ్రామస్తులు, నాయకులు బైరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీపీ నిధులతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడ బీసీ కాలనీలో ఎన్నో ఏళ్ల నుండి నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించింది. వర్షపునీరు బయటికి వెళ్లేందుకు వీలులేక కాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కాలనీవాసులు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ దృష్టికి తీసుకెళ్లగా తన నిధుల నుండి రూ.4.5 లక్షలు విడుదల చేశారు. దీంతో కాలువ నిర్మాణం పనులు, 4వ అంగన్వాడీ కేంద్రంలో దెబ్బతిన్న బండపరుపు పనులను మంగళవారం ప్రారంభించినట్లు తెలిపారు. వారంలోగా పూర్తి చేస్తామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభించింది. సచివాలయ పరిధిలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి 610 మందికి టోకెన్లుఇచ్చారు. వీరి కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆర్థోపెడిక్ వైద్యులు క్రాంతి కుమార్, జనరల్ సర్జన్ నీలాప్రసాద్, వైద్యాధికారులు నాగేంద్ర, రాబర్ట్ కెనడి, వెంకటసుబ్బయ్యతో పాటు వైద్య సిబ్బంది కలిసి శిబిరంలో 488 మందికి షుగరు, బిపి, కంటి పరీక్షలు, వివిధ రకాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ కంటి అద్దాలను పంపిణీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర -కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లతో పాటు బిజినవేముల సచివాలయంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికే ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరికి అయిన సరే ఆరోగ్య సమస్యలు ఏర్పడితే అందుకు అయ్యే ఖర్చు భరించలేని పేదలు ఈ కార్డు ద్వారా వైద్యసేవలు పొందవచ్చన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటిఅద్దాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్‌ఉన్నిషా, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ చెంచన్న, ఈఓఆర్డీ రాధిక, డా.విద్యాసాగర్, సర్పంచ్ పక్కీరమ్మ, వెలగటూరు సర్పంచ్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ తనిఖీ కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - రుద్రవరం : పర్యావరణ పరిరక్షణ నిర్వహణ కొరకు తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అహోబిలం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని బోరింగ్ బేస్ క్యాంప్ దగ్గర పర్యావరణ పరిరక్షణ తనిఖీ కేంద్రంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బోరింగ్ బేస్ క్యాంపు నుంచి పావన లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి వెళ్లే వాహనాలను నియంత్రించేందుకు అలాగే వాహనాల వల్ల వెలువడే కాలుష్యాన్ని నివారించేందుకు తనిఖీ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు, భక్తులు, పర్యాటకులు, బాటసారులు తాము ఉపయోగించిన వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ బాటిల్లు కవర్లు ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక చెత్తకుండీల్లోనే వేయాలని సూచించారు.అటవిలో సంచరించే సమయంలో అడవి జంతువులకు హాని తలపెట్టకుండా వాహనాలను నడపాలన్నారు. అడవుల సంరక్షణ కొరకు ప్రతి ఒక్కరు సహకరించాలని శ్రీపతినాయుడు కోరారు.

ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని అంకిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తుమ్మలపెంటలో ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఆయన పరిశీలించారు. ఆరోగ్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పేదలు అనారోగ్య కారణంగా ఇబ్బంది పడకూడదనే ఇంటి గడపకే వైద్య సేవలు తీసుకువచ్చారన్నారు. వైద్యులు రాజకుమార్,వినోద్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరంలో 431 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా రోగులకు మందులు అందజేశారు. 239 మందికి కంటిఅద్దాలు అవసరమని తెలిపారు. ఈఓపీఆర్డీ శ్రీహరి,రాజారెడ్డి, సుబ్బారెడ్డి, తిమ్మారెడ్డిలు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఈనెల 17 18 19 తేదీల్లో నంద్యాల లో జరుగు మహిళా సమాఖ్య 15వ రాష్ట్రమహాసభలను జయ ప్రదం చేయాలని ఆ సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు స్వాతి, ప్రశాంత కుమారి పిలుపు నిచ్చారు. మంగళవారం వెంగళరెడ్డి నగర్ మహిళా సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత నంద్యాలలో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు నిర్వహించుటకు అనుమతించిన రాష్ట్ర సమాఖ్య నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈమహాసభల జయప్రదానికి మహిళలు,మేధావులు, ప్రజాసంఘాల నాయకులు మహాసభలను జయప్రదం చేయడానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు నిర్మల, లక్ష్మీదేవి, నూర్జహాన్,లలితమ్మ, బసిరున్, రమిజాబి, హుస్సేన్‌బి, రోకాబి,లక్ష్మీదేవి, శంషరున్, ముర్తుజాబి, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేతోనే శాశ్విత పరిష్కారం - శిల్పా

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : భూ సర్వేతోనే శాశ్విత పరిష్కారం అవుతాయనీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలం కృష్ణాపురంలో భూహక్కు పత్రాలు అందజేసేకార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ భూసర్వే ద్వారా గ్రామాల్లో రైతుల మధ్య ఎలాంటి సమస్యలు రాకూడదనే ఈసర్వే ద్వారా శాశ్విత పరిష్కారం కావాలన్న గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. భూసమస్యలుంటే సమస్యను పరిష్కరించి రైతులందరికీ సమన్యాయం చేయాలే తప్పా, ఏలాంటి ఇబ్బందులకు తావు ఇవ్వరాదని సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. అనంతరం భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు శివ శంకర్‌రెడ్డి, సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - ప్యాపిలి : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గిరిజనులకు అనేక ప్రభుత్వ పథకాలను ప్రవేశపెడతామని చెప్పి అధికారంలోకి రాగానే గిరిజనులను మోసం చేశారని ఎరుకులహక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, ఏపి గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటార్ రాముడు, జిల్లా అధ్యక్షుడు మేడసారీ గోపాల్‌లు అన్నారు. మంగళవార వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల దాకా గిరిజనులు ఉన్నారన్నారు.వారికి ప్రభుత్వం నుంచి మైదాన ప్రాంతంలోని గిరిజన కులాలకు ఉపాధిలేక గిరిజనులు చెడుమార్గంలో పోయి ముద్దాయిలుగా మిగిలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ శాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయిందన్నారు. రాష్ట్రంలో బోగస్‌ఎస్టీలు విపరీతంగా పెరిగిపోవడం జరిగిందిదని వీటిపై నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో గిరిజన సత్తా చూపిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడినప్పుడు కోనేరు రంగారావు కమిటీ ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి మూడు ఎకరాలు సాగుభూమి ఇవ్వాల్సి ఉంటే కేవలం ఏజెన్సీ ప్రాంతంలో తప్ప మైదాన ప్రాంతంలో ఇవ్వడం లేదని ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఎక్కడని సూటిగా ప్రశ్నించారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నాం-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల : భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అనర్హుల ఓటర్ల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరించే ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేశ్ కుమార్ మీనాకు నివేదించారు.మంగళవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి ఓటర్ల జాబితా పునః పరిశీలన 6,7,8 ఫామ్ ల స్వీకరణ, ఇంటింటి సర్వే, డూప్లికేట్, షిఫ్టెడ్, డెత్ ఎలెక్టోరల్స్, జంక్ క్యారెక్టర్, 10కంటే ఎక్కువ ఓట్లు ఉన్న హౌసెస్, ఎపిక్ కార్డ్స్ జనరేషన్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అనర్హుల ఓటర్ల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి విచారణ చేపట్టి స్వచ్ఛమైన, పార దర్శక మైన ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు 73,597 ఎపిక్ కార్డుల జనరేషన్‌కు చర్యలు తీసుకుంటామని కమిషనర్ కు నివేదించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, దాసు, వెంకటరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు.

వైద్యులు..రోగులకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర-వెలుగోడు : ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం రోగుల నుంచి డబ్బులు జలగల్ల గుంజుతున్నారని, ప్రభుత్వ వైద్యులు ప్రజలకు మంచి సేవలు అందించి దేవుడు లాగా కీర్తింపబడాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన వెలుగోడులోని ఆసుపత్రిప్రాంగణంలో రూ.6.10 కోట్ల నాబార్డ్, 14వ నిధులతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మంత్రులు, ఎమెల్యేలు పాలన చేసి నప్పటికీ నేటి వరకు అత్యాధిక వసతులతో కూడిన వైద్యశాల ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. వేల్పనూరులో 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఆసుపత్రిని ఇంతవరకు ప్రారంభించలేక పోయారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో రూ.16 కోట్లతో ఆసుపత్రులను నిర్మిస్తున్నారని, ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. వైద్యశాలను 30 నుంచి 100 పడకలకు పెంచేలా చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

విలేకరులకు ఎమ్మెల్యే హెచ్చరిక : ఆసుపత్రిలో పందులు తిరుగుతున్నాయని, దోమలు ఉన్నాయని, అది బాగాలేదు..ఇది బాగాలేదు లాంటి కథ నాలు రాసి వైద్యులను భయాం దోళ నకు గురి చేయవద్దని చెప్పడం ఓ వార్నింగ్ లాగాచెప్పడంపై పలువురు చర్చించుకోవడం జరిగింది. ప్రైవేట్‌క్లినిక్ వైద్యులు నాగశేషులు, మునిరుద్దీన్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. బుడగ జంగాల సంఘ నాయకులు కమ్యూనిటీ హాలు,శ్మశానం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

ఆత్మకూరు టౌన్: ఆత్మకూరులో రూ. 3.90 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శిల్పా చక్రపాణి రెడ్డి లు మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ వైద్యశాలపై ప్రత్యేకమైన దృష్టిసారించి, అందుకు అను గుణంగానే ఖరీదైన వైద్య పరికరాలు సైతం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.అంతకు ముందు నాయకులకు వైద్యబృందం, నాయకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు.

పారదర్శకంగా పరిష్కారం చూపుతాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్పందనతో పాటు పోలీస్ స్టేషన్ వచ్చిన ప్రతి ఫిర్యాదును పారదర్శకంగానే పరిశీలించి పరిష్కారం చూపుతున్నామని ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు స్పష్టం చేశారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ పెద్ద చింతకుంట కు చెందిన సిద్దంరెడ్డి రమణారెడ్డి జిల్లాలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 33 సార్లు ఫిర్యాదు చేశానని తనకు న్యాయం జరగలేదని అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం పరిసరాలల్లో సోమవారం మీడియాతో చెప్పినట్లు కథనాలు రావడం జరిగిందన్నారు. జులై 08 2020లో స్పందనలో సిద్ధంరెడ్డి రమణారెడ్డి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు తాము పూర్తి విచారణ చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదు దారుడు తండ్రి అక్కిరెడ్డి , ఫిర్యాదుదారుడి బావ పలుచాని బాలిరెడ్డి మరో నలుగురు గత కొన్నేళ్లుగా కలిసి ఉమ్మడిగా పురుగులరసాయనక, ఎరువుల మందుల వ్యాపారం చేసేవారన్నారు. 2020లో ఉమ్మడిగా వ్యాపారం చేస్తున్న వీరు విడిపోయి బాగా పరిష్కారం చేసుకోవడం జరిగిందన్నారు. ఆస్తికి సంబంధించిన వ్యవహారంతో పాటు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉండడంతో తాము జోక్యం చేసుకోలేదని సీఐ తెలిపారు. పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోండి

విశాలాంధ్ర - నంద్యాల : రాజకీయ లబ్ధికోసమే తెలుగుదేశం పార్టీ నాయకులు బొగ్గులైన్ వాసులను అడ్డం పెట్టుకొని మభ్యపెట్టే మోసపు మాటలతో అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ కొరకు చేపడుతున్న చర్యలో భాగంగా ఆ ప్రాంతంలో నివాసమున్న వారికి ముందుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు.వైసీపీ ప్రభుత్వం 525 మందికి ఇళ్ల పట్టాలను ప్రభుత్వ అధికారుల సమక్షంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భూమా బొగ్గులైన్ ప్రాంత ప్రజల వద్దకు వెళ్లి ఇళ్లపట్టాలు పంపిణీ చేసిన స్థలాలపై కోర్టులకు వెళ్లారని వారికి అబద్దపు మాటలు చెబుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం భూమా చేస్తున్న ప్రయత్నమని ఎద్దేవా చేశారు. తాము బొగ్గు లైన్ వాసితులకు పంపిణీ చేసిన స్థలాలపై కోర్టులో కేసు ఉందని టీడీపీ వారు నిరూపించాలని చాలెంజ్ విసిరారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యం

విశాలాంధ్ర - గడివేముల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య రంగానికి పెద్ద పీట వేసినట్లు జడ్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా ఇంటింటికెళ్లి ప్రతి ఒక్కరికి ఏడు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కారక్రమం చేపట్టారు.

చంద్రబాబు వచ్చే పోరాటాలు

విశాలాంధ్ర -డోన్ రూరల్: చంద్రబాబు జైల్లో నుండి బయటకు వచ్చేవరకు పోరాటాలు ఆగవని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డి అన్నారు.మంగళవారం ప్యాపిలి మండలం, నల్ల మేకలపల్లె గ్రామనాయకులు, రైతులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు.ఈసందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాబు మచ్చలేని నాయకుడని త్వరలోనే కడిగిన ముత్యంలా జైలు నుండి బయటకు వస్తారన్నారు. రాష్ట్ర టీడీపీ తెలుగుయువత ఉపాధ్య క్షులు రాజశేఖర్‌నాయుడు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు సత్యం, రవికుమార్, భువనేశ్వర్‌నాయుడు, నరస య్య, బాలనరసింహులు, వెంకటరంగయ్య, సురేంద్ర నాయుడు, ప్రసాద్ నాయుడు, పుల్లారెడ్డిలు పాల్గొన్నారు.

వీఆర్వో ను పరామర్శించిన బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని జోలాపురానికికి చెందిన వెంకటరమణ వీఆర్వో తలకు శస్త్రచికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న బీసీ ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న వీఆర్వోను బీసీ గ్రామానికి చేరుకొని పరామర్శించి, వారి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారివెంట పాతపాడు సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, సంకేశ్వర్‌రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలు మంజూరు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలానికి 900 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి 40 శాతం రాయితీపై విత్తనాలు వచ్చాయన్నారు. క్వింటాల్ ధర రూ.8,100 కాగా,రాయితీపై రూ.4,860 ప్రభుత్వం అందిస్తుందన్నారు. శనగ విత్తనము జేజీ-11 రకం అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ తీసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు తీసుకున్న శనగ విత్తనాలు కచ్చితంగా పంట సాగు చేసి ఈ క్రాప్ చేసుకోవాలన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్ర సమీపంలోని జగనన్న కాలనీలో చింతలాయిపల్లి లేఔట్‌లో మౌలిక వసతుల్లో భాగంగా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. చింతలాయిపల్లికి చెందిన పలువురు పేదలకు కొలిమిగుండ్ల సమీపంలోని జగనన్న కాలనీలో నివాస స్థలాలను కేటాయించారు. దీంతో లబ్ధిదారులు తమకు కేటాయించిన నివాస స్థలాల్లో ఇంటి నిర్మాణాలను చేపట్టడంతో ప్రభుత్వం కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులు పనులను వేగవంతం చేశారు. సీసీ రోడ్లు, విద్యుత్,తాగునీటి బోరు, డ్రైనేజీ కాలువల నిర్మాణం తదితర పనులు చేపట్టారు.తద్వారా ఇంటి నిర్మాణాలు మరింత వేగవంతం కావడంతో అటు లబ్ధిదారులు ఇటు అధికారులు పనుల్లో నిమగ్న య్యారు. కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కనకద్రిపల్లి, చింతలాయిపల్లి,బెలుం సింగవరం తదితర గ్రామాల్లోని ఇండ్లులేని వారికి నివాసస్థలాలు ఇక్కడే కేటాయించడంతో కొత్త గ్రామాన్ని నిర్మిస్తున్నట్లుగా ఉంది.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

విశాలాంధ్ర -చాగలమర్రి: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం లాంటిదని సర్పంచ్ సరోజమ్మ, ఎంపీపీ వీరభద్రుడు, జడ్‌పిటిసి లక్ష్మీదేవి పేర్కొన్నారు.మంగళవారం మల్లెవేములలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈపథకాన్ని ప్రతిష్టాత్మకగా చేపట్టార న్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సచివాలయ పరధి లోని గ్రామాల్లో ఇంటింటికెళ్ళి ఏడురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యసేవలు అవసరమైన 300 మందికి టోకన్లు అందజేసారని తెలిపారు. మెరుగైన వైద్యం, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి కర్నూలు, నంద్యాల,ప్రొద్దుటూరు తదితర పట్టణాల లోని ప్రభుత్వ,ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల్లో సిఫార్స్ చేయడం జరుగుతుందన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

విశాలాంధ్ర - అవుకు : ఎరువుల దుకాణ యజమానులు యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. మంగళవారం అవుకులోని ఎంఎస్‌ఎస్ నరసింహులు, శ్రీనివాసులు ఏజెన్సీస్, భవాని ఫర్టిలైజర్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా నిర్ణీతధర కంటే అధికంగా విక్రయించరాదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇతర ఎరువులతో ఏరియాను అనుసంధానం చేసి అమ్మరాదన్నారు. అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

నిరాహార దీక్ష చేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : వైసీపీ ప్రభుత్వ తుగ్లక్ పాలనలో చంద్రబాబుపై అక్రమ కేసులతో అరెస్టు చేసి అవినీతి మరక అంటించాలని, జైలుకు పంపి రాక్షసానందం పొందుతున్నారని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు వంగాల శివరామిరెడ్డి విమర్శించారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు 21వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.

పూర్వపు విద్యార్థి దాతృత్వం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని ఇల్లూరు కొత్తపేటలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థి అప్పాజీ మురళి మోహన్ రావు జన్మదిన సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్నం భోజనానికి అవసరమైన 125 భోజనప్లేట్లు అందించారు. విద్యార్థులు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైవీ మల్లారెడ్డి, జీగోపాల్‌రెడ్డి, రామ్‌మద్దిలేటిరెడ్డి, కోడి నాగేష్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 1987-88 సంవత్సరం విద్యార్థుల తరపున పది పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు వరసగా రూ.5వేలు,రూ.3 వేలు, రూ.2 వేలు ప్రోత్సాహంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

వన్య ప్రాణులను సంరక్షించాలి

విశాలాంధ్ర-చాగలమర్రి : వన్య ప్రాణులను రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖాధికారి పెద్దన్న సూచించారు. మంగళవారం నగళ్ళపాడు ఎంపీపీ పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలలు నిర్వహించడం జరిగిందన్నారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వన్య ప్రాణులు అడువులు నివాసాలు లాంటివన్నారు. ఎవరైనా అడవిలోకి అక్రమంగా ప్రవేశించి వాటికి హాని కలిగించరాదని, చంపిన, హానికలిగించిన, కృష్ణ జింకలను వేటాడితే అలాంటి వారికి కఠినశిక్ష తప్పద స్పష్టం ఆయన చేశారు.

రామతీర్థ క్షేత్రంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పుట్టాలమ్మ పరశురామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండి లెక్కింపు చేసినట్లు ఆలయ పర్యవేక్షణ అధికారి హరిచంద్రారెడ్డి, ఈవో సాయి జయచంద్రారెడ్డిలు తెలిపారు. హుండిలెక్కింపు ద్వారా 16.34 లక్షలు వచ్చాయన్నారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి హుండీ లెక్కింపు రూ.3,03,475లు వచ్చాయన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 04,అక్టోబర్ 2023

కామ్రేడ్ పెద్ద మాదన్న వర్ధంతిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర – క్రిష్ణగిరి : బోయ బొంతిరాళ్ల గ్రామంలో ఈనెల 5వ తేదీన కామ్రేడ్ పెద్ద మాదన్న వర్థింతిని జయప్రదం చేయాలని క్రిష్ణగిరి మండల సిపిఐ కార్యదర్శి ఖలీల్ భాష,సహాయ కార్యదర్శి జె.రవి మోహన్ మంగళ వారం తెలిపారు. బోయ బంతిరాళ్ల గ్రామంలో కొంతమ ంది వ్యక్తులుతో కలిసి కామ్రేడ్ పెద్ద మాదన్న గ్రామంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించుటకు కృషి చేశాడు అన్నారు. ఎక్కడ సిపిఐ పార్టీ సభలు, కార్యక్రమాలు జరిగిన చురుకుగా పాల్గొని పెత్తందారి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలలో పాల్గొన్న వ్యక్తి అన్నారు. గత ఏడాది వైసిపి గుండాల దాడిలో గాయపడి కోలుకోలేక ఆస్పత్రిలో మరణించాడు అన్నారు. మొదటి వర్ధంతి సభకు రాష్ట్ర వ్యవసాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి గిడ్డయ్య, నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు, భీమ లింగప్ప, నబి రసూల్ లెనిన్ బాబు హాజరవుతారన్నారు. ఏర్పాటుచేసిన పెద్ద మాదన్న స్థూపంను ప్రారంభించి అనంతరం బహిరంగ సభ ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సిపిఐ కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని వారు కోరారు.

పెట్రోల్ బంక్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు : పట్టణంలో ఉన్న పెట్రోల్ బంకులలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించలేని పెట్రోల్ బంక్ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో (లేబర్ ఆఫీస్) అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఏఐటియుసి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు,వీరేష్ తిమ్మగురుడు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏమ్మిగనూరు పట్టణంలో పెట్రోల్ బంక్ లో పెట్రోల్ పోసే కార్మికులతో పెట్రోల్ బంక్ యజమానులు వెట్టిచాకి చేయిస్తూ శ్రమ దోపిడి గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బంకులలో పనిచేస్తున్న కార్మికులకు ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఈఎస్ఐ,పీఎఫ్ లాంటి సదుపాయాలు కల్పించకుండా చాలీచాలని జీతాలు ఇస్తూ వారితో పనిచేయిస్తున్నారని, జీతాలు పెంచాలని కార్మికులు అడిగితే పెట్రోల్ బంక్ యజమానులు దౌర్జన్యంతో పని నుండి మిమ్మల్ని తీసేస్తామని వారు బెదిరిస్తున్నారని వారు తెలిపారు. కాబట్టి తక్షణమే కార్మిక శాఖ అధికారిని స్పందించి ఎమ్మినూరు పట్టణంలో ఉన్నటువంటి పెట్రోల్ బంకుపై సమగ్ర విచారణ జరిపించి తక్షణమే కార్మికులకు ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం తో పాటు కనీస వేతనాన్ని కల్పించాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సోమశేఖర్,సుంకన్న,రవి పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం..ఒకరు అరెస్టు

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల పరిధిలోని రంగాపురం గ్రామ శివారులో ఈడిగ హరిచంద్ర గిలకసూగూరు నుండి కర్నాటక మద్యంను అక్రమంగా రవాణా చేస్తుండగా మంగళవారం ఎస్ఐ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. అతని వద్దనుండి 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్స్ మరియు మోటార్ సైకిల్ ని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి కోర్టుకి పంపినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యాన్ని అమ్మితో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రమంత్రి అజయ్ మిశ్రాను భర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర– కర్నూలు సిటీ : కేంద్ర హౌంశాఖ సహాయ మంత్రిని క్యాబినెట్ నుంచి భర్తరఫ్ చేయాలని, రైతుల మరణాలకు కారకుడైన అతని కుమారుడిని కఠినంగా శిక్షించాలని కార్మిక రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక, రైతు సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు బ్లాక్" డే కార్యక్రమాన్ని మంగళవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట జిల్లా కార్మిక,రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ అధ్యక్షతన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి,సిఐటియు జిల్లా అధ్యక్షులు పీఎస్. రాధాకృష్ణ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, ఎస్‌యుసిఐ జిల్లా నాయకులు నాగన్న, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మప్ప,రైతు స్వరాజ్య వేదిక జిల్లా నాయకులు పోతుల శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపి రైతుల ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయనందుకు నిరసనగా దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ సి గురు శేఖర్, డివైఎఫ్ఐ నాయకులు వై నగేష్, రాఘవేంద్ర,, సిఐటియు నాయకులు సాయిబాబా, చంద్రశేఖర్, నరసింహులు, విజయ్ ప్రభాకర్,ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేనయ్య ,నాగన్న రైతు కూలీ సంఘం నాయకులు వెంకటస్వామి, కార్మికులు, రైతులు,ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

ఆదోని రూరల్ : కేంద్రంలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా విధులు నిర్వహిస్తున్న అజయ్ మిశ్రా ను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించి తక్షణమే అరెస్టు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, సిపిఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు ఈరన్న డిమాండ్ చేశారు. జాతీయ రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణ నడిబద్దన ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ దగ్గర నుంచి భారీ ఎత్తున ర్యాలీగా బయలుదేరి ప్రభాకర్ థియేటర్ ముందు మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబి. నాగరాజు,జిల్లా సమితిసభ్యులు కల్లుబావిరాజు,పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు వెంకన్న, వైటి.భీమేష్,ప్రకాష్,బికేయంయు నియోజకవర్గ అధ్యక్షులు గంగన్న,రైతు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు చిన్న నరసప్ప,ఎల్లప్ప బసాపురం ఈరన్న, సిపిఎం నాయకులు లింగన్న,పిఎస్‌గోపాల్,ఐఎఫ్టియు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కేంద్ర కార్మికులు సమన్యా కమిటీ పిలుపుమేరకు బ్లాక్ డే నిరసన ఎమ్మార్వో ఆఫీస్ నుంచి వైయస్సార్ సర్కిల్ సోమప్ప సర్కిల్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. వామపక్ష రైతు కార్మిక సంఘాల నాయకులు హనుమంతు అధ్యక్షత వహించారు. గోవింద్, పంపన్న గౌడు,రాజు, సత్తన్న,సంజీవ, మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపి రైతుల ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయనందుకు నిరసనగా దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బ్లాక్ డే నిరసన కార్యక్రమానికి రైతు సంఘాలు కార్మిక సంఘాలు యువజన సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్, ప్రసాద్ , బాలు రాజు, రాముడు, సురేష్, జబ్బార్ వీరేష్ సుంకన్న రామాంజనేయులు భీమన్న నాగప్ప భాషా, రాజు, రాముడు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బన్నీ ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర –హొళగుంద : మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవం ఈ నెల 24న జరుగుతుందని ప్రజలు భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. నేరని లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవంలో రింగ్ కట్టెలు లేకుండా పాల్గొనాలని కోరారు.ఎలాంటి రక్త పాతం లేకుండా అందరూ సుఖ సంతోషాలతో కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు.సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎవరైనా గ్రామంలో కొత్త అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని,ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీస్ గట్టిగా వహిస్తుందని అన్నారు. గ్రామంలో ఏమైనా నేరాలు జరిగితే 100 సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. బన్నీ ఉత్సవం పట్ల నాటు తయారీ, బెల్లం ఊటగాని తయారు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ వన్నమ్మ వైకాపా నాయకులు సోమప్ప,వీరనాగప్ప,గ్రామపెద్దలు,ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

జి పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలకు మరో ప్రత్యేకత

విశాలాంధ్ర– కర్నూలు సిటీ : స్వయం ప్రతిపత్తి గల కళాశాలగా గుర్తింపు పొందిన జి పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌సిసి విభాగం మంజూరుతో మరో ప్రత్యేకతను చాటుకుంది. 28వ ఆంధ్ర బెటాలియన్ కమాండెంట్ కల్నల్ అక్షయ్ మాథుర్ మంగళవారం కళాశాలలోని మౌలిక సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్ సి సి వలన కలుగు లాభాలను వివరించారు.బీ.టెక్ అనంతరం సాయుధ దళాల్లో ఆఫీసర్గా ఎంపిక కావడానికి ఇది తొలిమెట్టు అన్నారు. దేహదారుఢ్యం తో పాటు మానసిక ఎదుగుదల వ్యక్తిత్వ వికాసం ఎన్‌సీసీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు అనంతరం 40 మందిని ఎంపిక చేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై పాండురంగయ్య, ప్రిన్సిపల్ సి. శ్రీనివాసరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి. శశి కుమార్ ఏఎన్‌ఓ ఎం. మధు శేఖర్, సిటిఓ బి. రవిచంద్రలు పాల్గొన్నారు.

రైతుల మృతికి కారణమైన కేంద్ర మంత్రి కుమారుడిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర – గోనెగండ్ల : రైతు వ్యతిరేక చట్టాలపై ఉద్యమం చేస్తున్న రైతు ఉద్యమకారులపై 2021 అక్టోబర్ మూడున ఉత్తరప్రదేశ్ లోని లఖీమ్ పూర్ ఖేరి లో కాల్పులు జరిపి నలుగురు రైతు ఉద్యమకారుల మృతికి కారణమైన కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రాను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ ,ఏఐటియుసి, సిఐటియు సంఘాల నాయకులు రాముడు నాగప్ప డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో ఎమ్మిగనూరు కర్నూలు ప్రధాన రహదారిపై బ్లాక్డేను పాటించి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులకు మూడు వ్యవసాయ చటాల రద్దును అమలు చేయడంలో మోడీ నిర్లక్ష్యం చేస్తున్నారని 44 రకాల కార్మిక చట్టాలను రద్దు పరచి కేవలం నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల హక్కులకు హరించేస్తున్నారని అందుకు నిరసనగా బ్లాక్డేను పాటించినట్లు తెలిపారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు వీరేష్ లింగన్న వెంకటేష్ చాంద్ రాకేష్ రవి నాగేష్ మున్నా వీరేష్ నాయుడు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో డాటర్స్ డే

విశాలంధ్ర –కర్నూలు సిటీ : ఆడపిల్ల గొప్పదనాన్ని చాటిచెప్పే ప్రత్యేకమైన రోజుగా డాటర్స్ డేను జరుపుకోవడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ తెలిపారు. స్థానిక మాధవ నగర్‌లోని నారాయణ పాఠశాలలో మంగళవారం స్కల్ ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు డాటర్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిలా,సోదరిలా నాన్నకు నీడలా, అమ్మకు తోడుగా,సోదరుడికి అండగా ఉంటూదన్నారు.మన దేశంలో ఆడపిల్లలను ధనలక్ష్మీగా తమ ఇంట అడుగుపెట్టిందని ఆనందంగా ఫీలవుతుంటారనీ ఆడపిల్లల గొప్ప తనని వివరించారు.అనంతరం తల్లి విశిష్ఠతను చిన్నారులు వేదికపై వ్యక్తం చేశారు. వేడుకలలో భాగంగా తల్లి కూతురుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరీ, రాధ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

విశాలాంధ్ర–పెద్దకడబూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరం లాంటిదని వైసీపీ జిల్లా కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని చిన్న తుంబలం గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైసీపీ జిల్లా కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ, ఎంపీటీసీ బడెమ్మలు పర్యవేక్షించి వైద్యాధికారిని శాంతిజ్యోతితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీరగోవిందమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ను సందర్శించి, వివిధ రకాలైన వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యులు సంజీవ కుమార్

విశాలాంధ్ర – సి.బెళగల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పేద ప్రజలకు వరమని కర్నూలు పార్లమెంటు సభ్యులు సంజీవ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సి.బెళగల్ లోని పాత బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరానికి శాసనసభ్యులు జరదొడ్డి సుధాకర్ తో కలిసి పార్లమెంట్ సభ్యులు సంజీవ కుమార్ హాజరై జగనన్న సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాలకు ఎక్కడ చూసినా ప్రజలు చూపించుకోవటానికి ఎక్కువగా రావడం జరుగుతుందని వచ్చినవారికి ఈసురక్షశిబిరం అధికారులు చెకప్ లు నిర్వహించి దానికి తగ్గట్టుగా మందులు ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. గత కొద్ది రోజుల నుండి గ్రామాలలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి శిబిరం నిర్వహించే విషయాన్ని ప్రజలకు తెలియచెప్పడంతో ఈ సురక్ష శిబిరానికి విశేష స్పందన వస్తుందని ఆయన అన్నారు. గత సంవత్సరాలలో కోవిడ్ రావడం వల్ల యువతకు ఎక్కువగా గుండెపోటు వచ్చి చనిపోవడం జరుగుతుందని కావున యువకులు కచ్చితంగా ఈ శిబిరంలో ఈసీజీ తీయించుకొని దానికి తగ్గట్టు మందులు వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, కర్నూల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎస్ ఎం భాష, జడ్పిటిసి గిరిజోను, ఎంపీటీసీ వీరన్న గౌడ్, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, తహసిల్దార్ శేషఫణి, ఈ ఓ ఆర్ డి సందీప్, స్పెషలిస్టులు, సి బెళగల్ మరియు పోలకల్ డాక్టర్లు హరిశ్చంద్రుడు, మిథున్ రెడ్డితదితర మండల స్థాయి అధికారులు మరియు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులు డైవర్షన్ పాలిటిక్స్ ఉచ్చులో పడొద్దు

–ఓట్లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోండి
–ప్రజల్లోకి వెళ్లి పార్టీ కార్యక్రమాలు కొనసాగించాలి

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : రాష్ట్రంలో జరుగుతున్న డైవర్షన్ పాలిటిక్స్ ఉచ్చులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు పడొద్దని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ జరుగుతు న్నాయని చంద్రబాబు నాయుడు అరెస్టయినప్పటి నుండీ తాను చెబుతూనే ఉన్నానన్నారు. అందుకు నిదర్శనంగానే చాలా మంది ఓట్లు తొలగించబడ్డా యన్నారు.ప్రజలు పడుతున్న ఇబ్బందులు,సమస్యలను పక్కదారి పట్టించేం దుకే చంద్రబాబు అరెస్టు జరిగిందన్నారు. తమ వెరిఫికేషన్ లో తొలగించా యని తేలిన ఓట్లనన్నింటినీ మళ్లీ నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు ముందుగా ఓట్లను చెక్ చేసుకోవాలని, తమకు చెందిన వారివి కూడా పరిశీలించాలని కోరారు. తమకున్న సమయంలోనే ఓట్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యం లో దీక్షలు, నిరసనల వరకే పరిమితం అవ్వకుండా ప్రజల్లోకెళ్లి అరెస్టు గురించి వివరించడం, రాష్ట్రంలో ఉన్న సమస్యలను తెలపడం, తెదేపా మేనిఫెస్టో గురించి చెప్పి.. బాబు ష్యూరిటీ బాండ్ పేపర్లను అందజేయడం వంటి కార్యక్రమాలన్నీ రోజూ చేయాలని స్పష్టం చేశారు.లేదంటే ఈ డైవర్షన్ పాలిటిక్స్ ఉచ్చులో మనమంతా పడిపోయినట్లేనని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు అరెస్టుతో పెద్ద పెద్ద కంపెనీలు ఏపీకి వచ్చి పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్ పరమేష్, నేతలు నాగ వీరాంజనే యులు, ఊట్ల రమేష్, ఆనంద్ రాజు, ఇబ్రహీం, సత్రం రామక్రుష్ణుడు, చెన్న, పాల్ రాజ్, ప్రభాకర్, నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఛాన్సలర్ దిష్టిబొమ్మ దగ్ధం

విశాలాంధ్ర – ఆదోని రూరల్ : రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆనందరావు దిష్టిబొమ్మను ఆర్పిఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్పీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, జిల్లా కార్యదర్శి బాలు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ పరిధి బీఈడీ కళాశాలలో దూరపు విద్య మాదిరిగా ఇతర రాష్ట్ర ఒడిశా, పశ్చిమబెంగాల్ విద్యార్థుల అడ్మిషన్లను తీసుకున్నారని, ఆర్సన్ సైన్స్ కళాశాలలో బీఈడీ పరీక్షలు జరుగుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో బీఈడీ సర్టిఫికెట్ కోసం పక్క రాష్ట్రాల నుంచి విద్యార్థులు పోటీ పడడం ఏంటని నిలదీశారు. ఓకే ఫ్యాకల్టీని కళాశాలలకు చూపిస్తూ, ఒడిస్సా పశ్చిమబెంగాల్ రాష్ట్రాల విద్యార్థులతో లక్షలాది రూపాయల దండుకుని అడ్మిషన్లు ఇవ్వడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల విద్యార్థులు కళాశాలలకు రాకపోయినా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయడం వెనక దాగి ఉన్న అంతర్యం ఏమిటనీ నిలదీశారు. యూనివర్సిటీ అధికారులు బీఈడీ కళాశాల యాజమాన్యాలతో ముడుపులు తీసుకోవడం తోనే విద్యా ప్రమాణాలు గాలికి వదిలేస్తున్నారని వాపోయారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యూనివర్సిటీ అధికారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ,వినోద్ రెడ్డి,విష్ణు,నరసింహ, రమాకాంత్,రంగా,నగేష్ తదితరులు ఉన్నారు.

భవ్యశ్రీకి న్యాయం చేయాలి

విశాలాంధ్ర – హొలగుంద : హొలగుందలో వడ్డెర సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారంచిత్తూరు జిల్లా,పెనుమూరు మండలం, వేణుగోపాలపురం గ్రామానికి చెందిన మైనర్ బాలిక వడ్డే భవ్య శ్రీ మృతికి న్యాయం చేయాలని చేపట్టిన శాంతి ర్యాలీ హొలగుంద మండల వడ్డెర సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీకి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే వెంకట్,వడ్డెర సేవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వడ్డే పెద్దయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనర్ బాలిక వడ్డే భవ్యశ్రీ హత్య జరిగి 15 రోజులు అవుతున్న అధికార ప్రభుత్వం నిందితులను గుర్తించి ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందని బీసీ సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికను అత్యంత కిరాతకంగా హత్య చేస్తే మహిళా కమిషన్ చైర్మన్ స్పందించడం లేదని, హెూం శాఖ మంత్రి గా ఒక మహిళ ఉండి కూడా ఆ కుటుంబానికి న్యాయం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని వీరు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని తెలిపారు. వైసీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రవ్యాప్తంగా వడ్డెరలపై దాడులు,దౌర్జన్యాలు పెరిగిపోయాయని వడ్డెర ఆడబిడ్డలను అత్యాచారం చేసి హత్యలు చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి పాలనలో వడ్డెరలకు రక్షణ లేదని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వడ్డెర బిడ్డ భవ్య శ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, 50 లక్షల రూపాయల పరిహారం ప్రకటించి హత్య చేసిన దుర్మార్గులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి వడ్డెర బిడ్డ భవ్యశ్రీ కి న్యాయం చేయాలని చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం దిగివచ్చే వరకు నిరసన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సేవ సమితి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, మండల అధ్యక్షుడు ఎర్రిస్వామి,ఉపాధ్యక్షుడు మరప్ప, కార్యదర్శి విశ్వనాథ్ ,వడ్డెర సేవ సమితి సభ్యులు హనుమంతు,లక్ష్మి స్వామి, కళప్ప, శేకన్న, సురేష్, శీనప్ప,నాగేంద్ర,వెంకటేష్, పాండు, రాము, వీరంజినేలు,పాపారాయుడు వడ్డెర సేవ సమితి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భవ్య శ్రీ నిందితులను కఠినంగా శిక్షించాలి అంటూ తాసిల్దార్ హుస్సేన్ సాబ్ వినతి పత్రాన్ని సమర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర – కౌతాళం రూరల్ : పార్టీలకతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగి రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని హాల్వి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై విచారించారు.అమలులో లోపాలను, జాప్యాన్ని ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రమై న కౌతాళంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులైన వారికి ఈ కార్యక్రమంలో పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి కోఆప్షన్ నెంబర్ మహబూబ్ సాబ్ వైయస్సార్ మండల అధ్యక్షులు ప్రహల్లాద చారి, నాయకులు ఏకాంబరెడ్డి, చెన్నప్ప గౌడ్, బసవ ప్రభువు, మరి గౌడ్, క్యాంప్‌అనిల్ కుమార్ తాసిల్దార్ రామేశ్వర్ రెడ్డి ,ఎంపీడీవో సుబ్బరాజు, పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వైద్య సేవలు... ఎమ్మెల్యే

విశాలాంధ్ర – పత్తికొండ : ప్రతి ఇంటికి వైద్య సేవలు సులువుగా అందించాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవనబండ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే శ్రీదేవి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి ఖరీదైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని,సీఎం జగన్ ముందుకు వెళుతున్నారని తెలిపారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ, ఎంపీపీ నారాయణదాసు,తహసిల్దార్ విష్ణు ప్రసాద్,ఎంపీడీవో కవిత, వైఎస్ఆర్సిపి నాయకులు శ్రీరంగడు, కారం నాగరాజు, గాంధీ రెడ్డి పాల్గొన్నారు.

పప్పు శనగ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర – ఆదోని రూరల్ : ఖరీఫ్ కాటేసింది,రభికి సన్నద్ధమైన రైతులకు ప్రభుత్వ రాయితీ పప్పు శనగ విత్తనాలను పంపిణీ చేసేందుకు అన్ని చర్యలు చేపట్టింది. మంగళవారం మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి,ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా రాయితీ పప్పు శనగ విత్తనాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ రవికి సాగు చేసుకునేందుకు అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం 40 శాతం రాయితీతో పప్పు శనగ విత్తనాలను ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయ రంగానికి మైలురాయిగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు.రైతు భరోసా కేంద్రాలలో అధికారులు సూచనల మేరకు అర్హులైన రైతులు వ్యవసాయ ఆధార పత్రాలు తీసుకువెళ్లి పప్పు శనగ విత్తనాలను పొందగలరని తెలియజేశారు. ప్రభుత్వం విధించిన క్వింటం పప్పు శనగ విత్తనాలు పూర్తి ధర రూ,,8100 నిర్ణయించగా, రూ,,3240 రాయితీ పోను రైతు వాటా రూ, 4860 ప్రభుత్వం నిర్ణయించిన ధరను రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశాల మేరకు వ్యవసాయం చేపట్టి అధిక దిగుబడులో వచ్చే విధంగా రైతులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి,మాజీ ఎంపీపీ బదాయి పంపాపతి, గురునాథ్ రెడ్డి,రైతులు,వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.